

ఆన్‌లైన్ షాపింగ్.. జర భద్రం

ఆన్‌లైన్ షాపింగ్‌పై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. కానీ, కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ షాపింగ్‌తో తీవ్రంగా నష్టపోతున్నారు.

- 8లో▸



తెలంగాణలో సామాజిక న్యాయం లేదు

- 8లో▸

రాష్ట్రంలో సామాజిక న్యాయం లేదని, దొరల రాజ్యం నడుస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31°/25°

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై ఉండి, చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి



ములుగు: జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల పక్కన నూతనంగా నిర్మిసున్న భవన నిర్మాణ పనులు, మ్యాప్‌ను కలెక్టర్ శుక్రవారం పరిశీలించి, మాట్లాడారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అన్ని విధాలుగా సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణ పనులు జరగాలని అన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, ఆర్ అండ్ బీ ఈఈ కిషన్ రావు, డీపీఓ కొండా వెంకయ్య, కలెక్టరేట్ ఏఓ ప్రసాద్, ములుగు తహసీల్దార్ విజయ భాస్కర్, ఆర్‌అండ్‌బీ డీఈలు రఘువీర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు బీఈడీలో ఉచిత ప్రవేశం

ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన విద్యార్థులకు బీఈడీ కళాశాలలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్లు డీడీ పోచం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో వంద సీట్లు గిరిజనులకు కేటాయించినట్లు తెలిపారు. డిగ్రీ 40 శాతం మార్కులతో పాసై ఉండాలని, మహిళలకు ప్రత్యేక సీట్లు ఉన్నాయని, ఆధార్ కార్డు, డిగ్రీ ఉత్తీర్ణత మెమో, ఏజెన్సీ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఏటూరునాగారం ఐటీడీఏ డీడీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పర్వతారోహకుడికి సన్మానం



మంగపేట: యూరప్‌లో అత్యధిక ఎత్తయిన మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన మండలంలోని వాడగూడెం గ్రామానికి చెందిన వాసం వివేక్‌కుమార్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈసందర్భంగా టెక్ మహేంద్ర కంపెనీలో ఉద్యోగి అయిన వివేక్ రష్యా జార్జియా సరిహద్దుల్లో ఉండే ప్రపంచంలోనే 10వ అత్యంత ప్రముఖ శిఖరంగా పేరుగాంచిన పర్వతాన్ని అధిరోహించడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. వివేక్‌ను స్ఫూర్తిగా తీసుకుని యువత ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. వివేక్‌ను అభినందించిన వారిలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్‌రావు, ప్రసాదరావు ఉన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యులు కొట్టె రాజిరెడ్డి, బండి ఈశ్వర్, శ్రమశక్తి అవార్డు గ్రహిత కుసుమ శ్యామసుందర్ పాల్గొన్నారు.

నియామకం



చింతనిప్పుల భిక్షపతి

ములుగు: బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా చింతనిప్పుల భిక్షపతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ శుక్రవారం ప్రకటించారు. ఈసందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న బీసీల రాజ్యాధికారం కోసం సంఘం చేస్తున్న పోరాటానికి సహకరిస్తానని తెలిపారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య, బచ్చు ఆనందం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

సమీపిస్తున్న మహా జాతర..

నిధులు కేటాయించని ప్రభుత్వం

- రూ.75కోట్లతో ప్రతిపాదనలు పంపిన అధికారులు
- వరదలతో మేడారంలో దెబ్బతిన్న రోడ్లు
- వ్యయ అంచనా పెరిగే అవకాశం



జంపన్నవాగు బ్రిడ్జి వద్ద ధ్వంసమైన రోడ్డు

ఎస్ఎస్ తాడ్వాయి : 2024 ఫిబ్రవరిలో జరిగే సమ్మక్క సారలమ్మల మహాజాతరకు ఇంకా ఆరు నెలల గడువు మాత్రమే ఉంది. ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం 18 శాఖల ద్వారా ఏర్పాట్ల కోసం రూ.75కోట్ల నిధులు అవసరమని అప్పటి కలెక్టర్ కృష్ణ ఆదిత్య ప్రభుత్వానికి నివేదిక పంపించారు. అయితే జాతర సమీపిస్తున్నా.. నిధుల కేటాయింపుల్లో జాప్యం చేయడంతో ఈ జాతరలో కూడా హడావుడి పనులతోనే నిర్వహించేలా కనిపిస్తోందని భక్తులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు కూడా సమీపిస్తుండటంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల బిజీలోనే నిమగ్నం కావడంతో జాతర పనుల్లో జాప్యం తప్పేలా లేదు.

నిధులు సరిపోయేనా..?

మేడారం జాతరలో భక్తుల సౌకర్యాల కోసం ప్రభుత్వానికి రూ.75కోట్ల మంజూరు కోసం అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అయితే జూలై చివరి వారంలో కురిసిన భారీ వర్షాలు, వరదలకు మేడారంలో శాశ్వతంగా నిర్మించిన కల్యాణ కట్ట షెడ్లు, రోడ్లు, విద్యుత్, గెస్ట్‌హౌజ్‌లు దెబ్బతిన్నాయి. జాతరకు రోడ్డు మార్గాలే చాలా అవసరం కానీ, వర్షాలకు రోడ్లు దెబ్బతినడంతో పాటు గుండ్లవాగు బ్రిడ్జి దెబ్బతినడంతో నెలరోజుల పాటు తాడ్వాయి నుంచి మేడారం మీదుగా ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలు మళ్లించడంతో ఈ మార్గాన రోడ్లు మరింతగా ధ్వంసమయ్యాయి. అధికారులు మాత్రం రూ.75కోట్ల ప్రతిపాదనలు మాత్రమే ప్రభుత్వానికి పంపించారు. కానీ, జాతర ఏర్పాట్లు, ఇప్పుడు అత్యవసరంగా కావాల్సిన మరమ్మతుల పనులకు ఈ నిధులు ఏ మూలన సరిపోతాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటు అసెంబ్లీ ఎన్నికలు, అటు జాతర సమీపిస్తుండంతో అధికా రులు, ప్రజాప్రతినిధులు ముందుగా ఎన్నికల ఏర్పాట్లకే పరిమితమయ్యే అవకాశం ఉంది.

జాతరకు ఆరు నెలలే గడువు..

మేడారం మహాజాతరకు ఇంకా ఆరునెలల సమయమే మిగిలింది. ప్రభుత్వం నుంచి ఇంకా నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు కూడా ముందుకు సాగే పరిస్థితి లేదు. నిధులు మంజూరు చేయడం, టెండర్ల ప్రక్రియ, టెక్నికల్ ఆర్డర్లు పొందడం లాంటి వాటికే నెలకు పైగా సమయం పడుతుంది. ముందస్తుగా నిధులు మంజూరైతేనే పనులు నాణ్యతగా చేసే అవకాశాలు ఉన్నాయి. కానీ, ఇప్పటి వరకు జాతర నిధులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో జాతర వరకు కూడా పనులు పూర్తయ్యే అవకాశాలు లేవని భక్తులు, స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తే జాతరకు నిధులు అసలు మంజూరవుతాయా.. లేదా.. అనే అనుమానం కలుగకమానదు. జాతర నిధుల మంజూరు విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాల్సిన మంత్రులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల బిజీలో నిమగ్నమయ్యారు.



మేడారం గద్దెల ప్రాంగణంలో భక్తులు(ఫైల్)


నిధులు మంజూరు చేయాలి



మేడారం జాతర నిధులను ప్రభుత్వం త్వరగా మంజూరు చేయాలి. జాతరలో భక్తుల సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి సారించి, సరిపడా నిధులు కేటాయించాలి. మంత్రులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి జాతరకు ముందే పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి.

- సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

త్వరలో విడుదల!



- టీపీసీసీ చేతిలో ఆశావహుల దరఖాస్తులు
- ఉమ్మడి వరంగల్ నుంచి 53 మంది..
- డీసీసీ, పీసీసీల సిఫారసుతో సీడబ్ల్యూసీకి జాబితా
- బీఆర్‌ఎస్‌ను ఎదుర్కొనే అభ్యర్థులపై కసరత్తు
- ఆశావహుల్లో ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్లు

సాక్షిప్రతినిధి, వరంగల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై కసరత్తు మలిదశకు చేరింది. త్వరలోనే ఉమ్మడి వరంగల్‌లోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించవచ్చని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక కోసం చేపట్టిన దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 53మంది వివిధ స్థానాలకు దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ స్క్రీనింగ్ కమిటీ, ఎన్నికల నిర్వహణ కమిటీలు ఆ దరఖాస్తులను పరిశీలించి జిల్లా కాంగ్రెస్ కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని రెండు రోజుల్లో సీడబ్ల్యూసీ, పార్టీ కేంద్ర ఎన్నికల పరిశీలన కమిటీకి పంపనున్నారని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను దీటుగా ఎదుర్కొనే వారినే ఈసారి బరిలోకి దింపే ఆలోచనలో ఉన్న అధిష్టానం.. ఆశావహుల జాబితాపై త్వరలోనే తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తుంది.

భూపాలపల్లి, ములుగులకు ఒక్కొక్కటి.. మిగతా చోట్ల పోటాపోటీ...

ఈ నెల 18న మందకొడిగా సాగిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థుల దరఖాస్తుల ప్రక్రియ.. మూడు రోజులుగా పోటెత్తింది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముఖ్య నాయకులంతా గురువారం, శుక్రవారాల్లో తమ దరఖాస్తులను హైదరాబాద్ గాంధీభవన్‌లో దాఖలు చేశారు. శుక్రవారం రాత్రి వరకు పార్టీ వర్గాల సమాచారం మేరకు 53మంది ఆయా నియోజకవర్గాల నుంచి టికెట్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాలకు ఒక్కొక్కరు చొప్పున దరఖాస్తు చేసుకోగా.. నర్సంపేట నుంచి రెండు దరఖాస్తులు దాఖలయ్యాయి. అత్యధికంగా వర్ధన్నపేట నుంచి పదకొండు మంది వరకు పోటీ పడుతున్నారు. 12 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల నాయకులు దరఖాస్తు చేసుకున్నారు.

నియోజకవర్గాల వారీగా దరఖాస్తుదారుల వివరాలు..

వరంగల్ తూర్పు: కొండా సురేఖ, ఎర్రబెల్లి స్వర్ణ, ఎంబాడి రవీందర్, అజ్మతుల్లా హుస్సేనీ
వరంగల్ పశ్చిమ: నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డి, కట్ల శ్రీనివాస్, రేపల్లె శ్రీనివాస్, తక్కళ్లపెల్లి సారిక, రేపల్లె రంగనాథ్
జనగామ: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, ఎర్రమళ్ల సుధాకర్, గిరి కొండల్‌రెడ్డి
పాలకుర్తి: అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, బండి సుధాకర్ గౌడ్, అనుమాండ్ల తిరుపతిరెడ్డి, లక్ష్మీనారాయణ నాయక్
పరకాల: ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, కొండా మురళీధర్ రావు, అవేలి దామోదర్, కట్కూరి దేవేందర్ రెడ్డి, బొమ్మతి విక్రమ్
మహబూబాబాద్ : బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్, నునావత్ రాధ, నునావత్ రమేష్, దస్రునాయక్
స్టేషన్ ఘన్‌పూర్: దొమ్మాటి సాంబయ్య, సింగపురం ఇందిర, చేపూరి వినోద్, డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ, గంగారపు అమృతరావు, డాక్టర్ రాజమౌళి
డోర్నకల్ : జాటోత్ రాంచంద్రు నాయక్, మాలోత్ నెహ్రూ నాయక్, ననావతు భూపాల్ నాయక్
ములుగు: ధనసరి సీతక్క
భూపాలపల్లి: గండ్ర సత్యనారాయణ రావు
నర్సంపేట: దొంతి మాధవరెడ్డి, కత్తి వెంకటస్వామి
వర్ధన్నపేట: నమిండ్ల శ్రీనివాస్, కేఆర్ నాగరాజు, బక్క జడ్సన్, సిరిసిల్ల రాజయ్య, నుంచు రవి, బందెల భద్రయ్య, పులి అనిల్, ఆనంద్‌కుమార్, నరుకుడు వెంకటయ్య, యాకస్వామి, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

ఓవర్ టు హైదరాబాద్.. ఆశావహుల ఢిల్లీబాట

వారం రోజుల లోపే అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందన్న సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీ ఆశావహులు పలువురు అప్పుడే ఢిల్లీబాట పట్టారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసే వరకు హైదరాబాద్‌లోనే మకాం వేసిన పలువురు నేతలు ఢిల్లీలో ఏఐసీసీ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు పయనం అయ్యారు. కొందరు డీసీసీ నేతలను, మరికొందరు టీపీసీసీ పెద్దలను వెంటబెట్టుకుపోగా.. మరికొందరు ఏకంగా ఏఐసీసీ పెద్దలతోనే లాబీయింగ్ చేస్తుండటం ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్‌లో వేడిని పెంచింది.

వరలక్ష్మీ.. నమోస్తుతే

శ్రావణమాసం తొలిశుక్రవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా మహిళలు వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. పిల్లాపాపలను చల్లగా చూడాలని, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండేలా దీవించమని వరలక్ష్మీమాతను వేడుకున్నారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకొని అంతా మంచి కలగాని ఆకాంక్షించారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

- సాక్షి నెట్‌వర్క్



అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

ములుగు: అక్టోబర్ 01వ తేదీ వరకు జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అధికారులతో మాట్లాడారు. ఈ నెల 26, 27, సెప్టెంబర్ 02, 03 తేదీల్లో గ్రామాలు, మండలాల వారీగా ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా తేదీల్లో బీఎల్‌ఓలు పోలింగ్ బూత్ కేంద్రాల వద్ద ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉండాలని, సందేహాలను నివృత్తి చేయాలని అన్నారు. ఆగస్టు 21న జారీ చేసిన ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలపాలని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు, జర్నలిస్టులు, జ్యుడీషరీ, ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్యమైన వ్యక్తుల వివరాలు ఓటరు జాబితాలో ఉండేలా బీఎల్‌ఓ, సూపర్ వైజర్లు పరిశీలించి ధ్రువీకరణను సమర్పించాలన్నారు. వీఐపీల వివరాలపై ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు.

బడే నాగజ్యోతికి ఘన స్వాగతం

ఎస్ఎస్ తాడ్వాయి: ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా శుక్రవారం స్వగ్రామం కాల్వపల్లికి వెళ్లిన జెడ్పీ చైర్ పర్సన్ నాగజ్యోతికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మావోయిస్టు ఉద్యమంలో అమరులైన తన తల్లిదండ్రుల చిత్రపటాల వద్ద నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. పుట్టిన గడ్డపై సర్పంచ్ స్థాయి నుంచి జెడ్పీ చైర్ పర్సన్, ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు తమ ఆడబిడ్డగా ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని కోరారు. మారుమూల గ్రామం కాల్వపల్లికి చెందిన తనకు ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

నాగజ్యోతికి 2+2 భద్రత

ములుగు: జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతికి ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుశాఖ 2+2 కేటగిరి కేటాయించింది. దీంతో శుక్రవారం విధుల్లోకి చేరిన గన్‌మెన్లు నాగజ్యోతికి జిల్లా కేంద్రంలో పుష్పగుచ్ఛం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ సమస్యల విషయంలో తన వద్దకు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మసులుకోవాలని, ఏ ఒక్కరిని ఇబ్బంది పెట్టకూడదని గన్‌మెన్లకు సూచించారు.



తల్లిదండ్రులకు నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

ములుగు బీఆర్‌ఎస్‌లో ముసలం!

- బడే నాగజ్యోతికి టికెట్‌పై అసంతృప్తి
- మాజీ మంత్రి చందూలాల్ కుమారుడి వేరుకుంపటి
- అనుచరులతో సారంగపల్లిలో ప్రహ్లాద్ భేటీ
- ములుగు నుంచి పోటీలో ఉంటానని స్పష్టీకరణ

సాక్షిప్రతినిధి, వరంగల్: ములుగు బీఆర్‌ఎస్ పార్టీలో ముసలం పుట్టింది. ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతికి టికెట్ కేటాయించడంపై అసంతృప్తి రగిలింది. ఈ నెల 21న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్.. ములుగుకు నాగజ్యోతి పేరును ఖరారు చేశారు. ఇది జరిగి సుమారు ఐదు రోజులు గడుస్తుండగా.. చాపకిందినీరులా మొదలైన అసంతృప్తి శుక్రవారం బయటపడింది. మాజీ మంత్రి చందూలాల్ కుమారుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ అజ్మీరా ప్రహ్లాద్ తన అనుచరులతో ములుగు మండలం సారంగపల్లిలో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ములుగు జెడ్పీ చైర్మన్, జిల్లా అధ్యక్షుడు కుసుమ జగదీష్ మరణాంతరం ములుగు బీఆర్‌ఎస్ రాజకీయాల్లో కొంత స్తబ్దత నెలకొంది. ఇదే సమయంలో ఆయన స్థానంలో జెడ్పీ వైస్ చైర్మన్‌గా ఉన్న బడే నాగజ్యోతి ఇన్‌చార్జ్ జెడ్పీ చైర్మన్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలతో పాటు అధిష్టానం ఆదేశాల మేరకు యాక్టీవ్ రోల్ పోషిస్తున్నారు. చందూలాల్ మరణాంతరం ప్రహ్లాద్ సైతం యాక్టీవ్‌గా ఉంటూ ఆయన కూడా ములుగు టికెట్ ఆశించారు. అయితే ములుగు అసెంబ్లీ అభ్యర్థిగా నాగజ్యోతిని అధినేత కేసీఆర్ ప్రకటించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన ప్రహ్లాద్ తన మద్దతుదార్లతో సారంగపల్లిలో సమావేశం నిర్వహించారు. 'బీఆర్‌ఎస్ టికెట్ వస్తుందని చివరి వరకు ఆశించాను.. ములుగు ప్రాంతాన్ని నాన్నతో కలిసి అభివృద్ధి పథంలో నడిపించాను.. తెలంగాణ ఉద్యమంలో శక్తి వంచన లేకుండా పని చేసాను.. సీఎం కేసీఆర్ పట్టించుకోకపోవడం బాధించింది..' అంటూ ఆ సమావేశంలో ప్రహ్లాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తనను నమ్ముకుని ఉన్న కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, నియోజవర్గ కార్యకర్తల నిర్ణయంతో త్వరలో భవిష్యత్తు ప్రణాళిక ప్రకటిస్తానని ఆయన ప్రకటించడం బీఆర్‌ఎస్ వర్గాల్లో కొత్త చర్చకు తెరతీసింది. ఓ వైపు స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో చెలరేగిన అసంతృప్తి, టికెట్ల వివాదం సద్దుమణగకముందే ములుగులోనూ ముసలం పుట్టడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

కార్యకర్తల అభీష్టం మేరకే నిర్ణయం

ములుగు: మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ కుమారుడు ప్రహ్లాద్ అధికార బీఆర్‌ఎస్ పార్టీ తరఫున టికెట్ కోసం ప్రయత్నాలు చేసినా.. సీఎం కేసీఆర్ నిరాకరించడంతో భవిష్యత్ కార్యచరణలో భాగంగా శుక్రవారం ములుగు మండలంలోని సారంగపల్లిలో మద్దతుదారులతో సమావేశాన్ని నిర్వహించారు. తన తండ్రి చందూలాల్ అనుచరులు, తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన నాయకులు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన మాజీ మంత్రి చందూలాల్ ఓటు బ్యాంకు తన వెంట ఉందని అన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు కార్యచరణ ప్రకటిస్తానని తెలిపారు. ఇదిలా ఉండగా బీఆర్‌ఎస్ పార్టీ తరపున రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తే తమ మద్దతు 100 శాతం ఉంటుందని మద్దతుదారులు తెలిపినట్లుగా సమాచారం. ఈ విషయం బయటికి రావడంతో బీఆర్ఎస్ పార్టీలో ఆందోళనకరమైన వాతావరణం నెలకొంది. గతంలో చందులాల్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొంత మంది సొంత పార్టీ నాయకుల నుంచి వ్యతిరేకత రావడంతో భారీగా ఓట్లు చీలి సీతక్క ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ బడే నాగజ్యోతికి టికెట్ కేటాయించడంతో ప్రహ్లాద్ వర్గం అసమ్మతిలో ఉన్నారని తెలుస్తుంది. దీనిపై అధికార పార్టీ నాయకులు వివరాలను సేకరిస్తున్నారు. ప్రహ్లాద్ వెంట ఉన్న నాయకులకు సర్ది చెప్పి కలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలుస్తుంది.



నాయకులతో సమావేశమైన ప్రహ్లాద్

త్వరలో కార్యచరణ ప్రకటిస్తా..

ఎస్ఎస్ తాడ్వాయి: బీఆర్‌ఎస్ పార్టీలోని తన అనుచరులతో ఆయన శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేకంగా సమావేశమైన దివంగత మాజీ మంత్రి అజ్మీరా చందులాల్ తనయుడు ములుగు మార్కెట్ మాజీ చైర్మన్ అజ్మీరా ప్రహ్లాద్ తన భవిష్యత్ కార్యచరణ త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ములుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా టికెట్ కేటాయించకపోవడంపై అనుచరులతో చర్చించారు. అన్ని మండలాల్లోని అనుచరులను కలిసిన అనంతరం తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ కుక్కల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, నాయకులు అలేటి జయపాల్‌రెడ్డి, సమ్మిరెడ్డి, పత్తి గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, ముంద్రాతి శ్రీనివాస్, సయ్యద్ హుసేన్, సుభాష్‌గౌడ్, భద్రయ్య పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు

ఎస్ఎస్ తాడ్వాయి : తాడ్వాయి - పస్రా మార్గంలో ప్రమాద నివారణ పోలీస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల ఈ మార్గంలో అనేక ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పలువురు మరణించారు. ఈ మేరకు ఎస్పీ గాస్ ఆలం ఆదేశాల మేరకు తాడ్వాయి - పస్రా మార్గంలోని రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లకు డీఎస్పీ రవీందర్ శుక్రవారం రేడియం స్టిక్కర్లను అంటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చిపోయే వాహనచోదకులు రేడియం స్టిక్కర్లను గుర్తించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పస్రా, తాడ్వాయి ఎస్సైలు శంకర్, ఓంకార్ యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ ఎన్నికల హామీలను నెరవేర్చాలి

కలెక్టర్ కార్యాలయం ముట్టడి

ములుగు రూరల్: సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కలెక్టర్ కార్యాలయం ఎదుట మోహరించారు. బీజేపీ కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన చేపడుతున్నా అడ్డుకోవడం సరికాదని జిల్లా అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. ప్రభుత్వం పద్ధతి మార్చుకోనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, గాజుల కృష్ణ, గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ తక్కెళ్లపల్లి దేవేందర్ రావు, అసెంబ్లీ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా ఉపాధ్యక్షులు భూక్య జవహర్ లాల్, అడప భిక్షపతి, ఏనుగు రవీందర్ రెడ్డి, అల్లే జనార్ధన్, జిల్లా కార్యదర్శి శీలమంతుల రవీంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన బీజేపీ నాయకులు

సీఎం కేసీఆర్ మనసు మారాలి

దీక్షాస్థలంలోనే రెండో ఏఎన్‌ఎంల వరలక్ష్మీ వ్రతం

ములుగు రూరల్ : రెండో ఏఎన్‌ఎంల రెగ్యులరైజేషన్‌పై సీఎం కేసీఆర్ మనసు మారాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు ఎదుట వరలక్ష్మీ వ్రతం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, రెండో ఏఎన్‌ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోడి సుజాత, ఉపాధ్యక్షురాలు సిలివేరు వజ్ర మాట్లాడారు. 16 సంవత్సరాలుగా కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు అన్యాయం జరుగుతుందన్నారు. మొదటి ఏఎన్‌ఎంతో సమానంగా పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రెగ్యులర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో జేరిపోతుల పైడి బాబు, రజిత, ఆదిలక్ష్మి, సులోచన, శకుంతల, సోమలక్ష్మి, భాగ్య, ధనలక్ష్మి, చంద్రకళ, పుణ్యవతి, సమ్మక్క, కవిత, లక్ష్మీ, సునిత, పుష్ప, సుగుణ, సరోజిని, మంగ, వెంకటనర్సమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

బీసీల్లో రాజకీయ చైతన్యం అవసరం

● కేయూ వీసీ తాటికొండ రమేష్


బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: బీసీల్లో ఐక్యత, రాజకీయ చైతన్యం అవసరమని కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్ అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బిందేశ్వర్ ప్రసాద్ మండల్ 105వ జయంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సామాజిక అంశాలపై స్పందించాలని, ప్రశ్నించాలన్నారు. సంస్కరణలు, రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అన్నారు. 76 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో బీసీ కులాలలు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నాయన్నారు. ఎన్నో కమిషన్లు బీసీల ఆర్థిక, సామాజిక అంశాపై నివేదికలు ఇచ్చాయన్నారు. ఒక సామాజిక ఏజెండాతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పూలే దంపతులు గొప్పసంస్కర్తలన్నారు. వారి సేవలు ఒకే వర్గానికే పరిమితం కావొద్దన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి సురేష్‌లాల్, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఏ శ్రీనివాస్, కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవరెడ్డి, అడ్జెంట్ ప్రొఫెసర్ ఎన్ రామస్వామి, రిటైర్డ్ ఆచార్యులు కె విజయబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న కొమ్ముల బాబు

హన్మకొండ అర్బన్/ హన్మకొండ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు తెలిపారు. శుక్రవారం హనుమకొండలో నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి భిక్షపతి, యానం విజయ్ కుమార్ సంఘం నిబంధనలకు వ్యతిరేకంగా, టీ పీఆర్‌టీయూ సభ్యులుగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని సంఘం నుంచి బహిష్కరించామన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా తొంత సత్యనారాయణ (యాదాద్రి భువనగిరి జిల్లా), ప్రధాన కార్యదర్శిగా చాగంటి ప్రభాకర్ (మహబూబాబాద్ జిల్లా), కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నీరటి సాయిలు (నిజామాబాద్ జిల్లా), రాష్ట్ర అధికార ప్రతినిధిగా జూపాక జనార్దన్ (హనుమకొండ జిల్లా) అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా దారా శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కచ్చిగళ్ల మల్లయ్య, పానుగంటి యాదగిరి, పాగ సునీత, భూక్యా విజయలక్ష్మి (వరంగల్ జిల్లా) ఎన్నికయ్యారని వివరించారు. మరో ఆరుగురిని ప్రత్యేక రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినట్లు తెలిపారు.

ఆన్‌లైన్ షాపింగ్.. జర భద్రం

● కనీస జాగ్రత్తలు తీసుకోవాలి
● అప్రమత్తత తప్పనిసరి
● ఆకర్షణీయ ప్రకటనలు, ఆఫర్లను నమ్మితే ఇక అంతే..

డిస్కౌంట్లు.. డిస్కౌంట్లు. అప్‌టు 50 పర్సంట్, 75 పర్సంట్ వరకు తగ్గింపు.. ఒక వస్తువు కొంటే మరోటి ఫ్రీ.. పైగా ఉచిత డోర్ డెలివరీ.. ఇలా ఒకటేమిటి ఆన్‌లైన్ షాపింగ్‌లో అన్నీ ఇలాంటి ఆఫర్లే దర్శనమిస్తాయి. బోగస్ ప్రకటనలెన్నో. ఇందులో కొన్ని నిజం కూడా కావొచ్చు.. అయితే ఉద్యోగాలు, ఇంటి పనులతో సమయం చిక్కని వారికి ఆన్‌లైన్ షాపింగ్ వరమే. కానీ ఆన్‌లైన్ షాపింగ్‌లో ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉంది. తగిన సూచనలు పాటిస్తూ, విచక్షణ ఉపయోగించి ఆన్‌లైన్ షాపింగ్ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.



కాజీపేట: ప్రస్తుత కాలంలో ఆన్‌లైన్ షాపింగ్‌పై అన్ని వర్గాల వారు ఆసక్తి కనబరుస్తున్నారు. షోరూంలలో కనిపించని వస్తువులు అనేకం ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి. అయితే నెట్‌లో కనిపించే ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలన్నీ నమ్మితే మోసపోవడం ఖాయం. ప్రచారంలో చెప్పేదొకటి.. ఆర్డర్ ఇవ్వగానే డెలివరీ అయ్యేది మరోటి. పైగా ధరల్లో తేడాలు. దీని గురించి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉంటుంది. ఆన్‌లైన్ షాపింగ్‌లో చాలా తక్కువ ధరలకే వివిధ రకాల ఉత్పత్తులను లభిస్తున్నాయి. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఫర్నిచర్, రెడీమేడ్స్, లేడీస్ యాక్సెసరీస్, కాస్మోటిక్స్, స్మార్ట్‌ఫోన్‌లు ఇలా అనేక రకాల ఉత్పత్తులు ఉన్నాయి. ఆర్డర్ చేసిన కొద్దిరోజుల్లోనే ఆయా కంపెనీలు వాటిని ఇంటికే నేరుగా సరఫరా చేస్తాయి. ఇంట్లో కూర్చోనే కావాలిసిన వస్తువులను హాయిగా కొనుగోలు చేస్తున్నారు. అయితే చూడడానికి, వినడానికి ఇది ఎంతో బాగున్నా కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్డర్ ఇచ్చిన వస్తువులు ఇంటికి రాగానే వాటిని చూసి అవాక్కైపోతున్న వారు అధిక శాతం మంది ఉన్నారు.

ఆకర్షణలకు లొంగొద్దు..

ఆకర్షణీయమైన ప్రకటనలు ఇచ్చే కంపెనీల్లో నమ్మకమైనవే కాకుండా కొన్ని బోగస్ కంపెనీలు కూడా ఉంటాయి. ఉదాహరణకు ఒక స్మార్ట్‌ఫోన్‌కు ధర చెల్లిస్తే ఉచితంగా ఇంటికి చేరుస్తామని చెప్పారు. తీరా ఆర్డర్ చేసిన తర్వాత ఇంటికి వచ్చిన ప్యాక్‌ను తెరిస్తే బొమ్మ ఫోన్ లేదా రాళ్లు నింపి పంపించిన ఘటనలు అనేకం ఉన్నాయి. అలాగే రెడీమేడ్ వస్తువులు ఆర్డర్ ఇస్తే నాసిరకం ఉత్పత్తులు పంపించిన సందర్భాలు ఉన్నాయి. తీరా వారిచ్చిన నంబర్‌కు ఫోన్ చేసినా ఫలితం ఉండదు. దీంతో తాము మోసపోయమని గ్రహించిన పట్టించుకునే వారు ఉండరు. అందుకే ఆన్‌లైన్ షాపింగ్ చేసే ముందు ఆయా కంపెనీల గురించి తెలుసుకుని ఉండడం మంచిది.

ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు..

- సదరు కంపెనీ ఎలాంటి ఉత్పత్తులపై వ్యాపారం చేస్తుందో గమనించాలి.
- కంపెనీకి సంబంధించిన వివరాలు ముందే తెలుసుకోవాలి.
- ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులు, షాపింగ్ మాల్స్‌లో లభించే వస్తువుల ధరల్లో ఏమైనా తేడాలు ఉన్నాయో లేదో గమనించాలి.
- ఆయా ఉత్పత్తులపై ఇచ్చే డిస్కౌంట్స్, వివిధ రకాల ఆఫర్లపై అవగాహన ఉండాలి.
- బోగస్ కంపెనీల గురించి తరచూ పత్రికల్లో కానీ, పోలీసులు చెబుతుంటారు. వాటిని పరిశీలిస్తూ ఉండాలి.
- ఆన్‌లైన్ మోసాలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేకంగా సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ విభాగం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.
- ఎప్పుడైనా మోసపోయినట్లు తెలిస్తే వెంటనే సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేయొచ్చు.
- ఆన్‌లైన్ కంపెనీలకు సంబంధించిన ఫోన్ నంబర్లను దగ్గర ఉంచుకోవాలి. వాటి అడ్రస్ గురించి తెలుసుకోవాలి. ఎప్పుడైనా మోసం జరుగుతుందని అనుమానం వస్తే సదరు నంబర్‌కు ఫోన్ చేయాలి.
- ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువుల ప్యాకింగ్‌పై కంపెనీల చిరునామా, ఎప్పుడు తయారయ్యాయే గమనించాలి.

కంపెనీల విశ్వసనీయతను పరిగణనలోకి తీసుకోవాలి



ఆన్‌లైన్‌లో కనిపించే ప్రతి ప్రకటన నిజమేననే భ్రమ వీడాలి. ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు ఆయా కంపెనీలకు ఉన్న విశ్వసనీయతను పరిగణనలోకి తీసుకోవాలి. లేదంటే వినియోగదారుడు మోసపోయే అవకాశాలు మెండుగా ఉంటాయి.

-సార్ల రాజు సీఐ, కాజీపేట

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం

● క్యాబిన్‌లో ఇరుక్కున్న డీసీఎం డ్రైవర్.. తీవ్రగాయాలు
● బస్సులోని ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలు


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

చిల్పూరు: యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వేగంగా వచ్చిన డీసీఎం ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కథనం ప్రకారం హుస్నాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మండలంలోని శ్రీపతిపల్లి మీదుగా చిన్నపెండ్యాల నుంచి హైదరాబాద్ వెళ్తోంది. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు చిన్నపెండ్యాల బస్‌స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై ఘన్‌పూర్‌వైపునకు యూటర్న్ తీసుకుంటోంది.ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి బస్సును వెనుక వైపు నుంచి ఢీకొంది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ ఎస్‌కే సజ్జద్ అహ్మద్ క్యాబిన్‌లో ఇరుక్కపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని స్థానికులు డ్రైవర్‌ను బయటకు తీశారు. బస్సులో వెనుక వైపు కూర్చున్న ప్రయాణికులు యాదమ్మ, శ్రీనివాస్‌కు తీవ్రగాయలయ్యాయి. ముగ్గురు క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం తరలించారు. అనంతరం ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం..

● ఇద్దరి అరెస్ట్, పరారీలో ఒకరు
● రూ 4.40 లక్షలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్ : యూకే, ఇతర విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేసిన కేసులో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 4.40 లక్షలు స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కేసు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ మోహిన్ బాగ్ ప్రాంతానికి చెందిన షేక్ అలీమ్ అహ్మద్, ఎండీ. మినాజోద్దీన్ ఖాన్, ఎండీ. దానిష్.. నాలుగు సంవత్సరాల నుంచి హైదరాబాద్ మలక్‌పేటలో ఎంఎస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ పేరుతో ఓ సంస్థను నడుపుతున్నారు. నిరుద్యోగులకు వీసాలు ఇప్పించి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వరంగల్‌కు చెందిన హాఫీజ్ (ఫ్రీ లాన్సర్)తో పరిచయం ఏర్పరుచుకున్నారు. తద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర ప్రాంతాలకు చెందిన 25 మంది నిరుద్యోగుల నుంచి రూ. కోటి 8 లక్షలు వసూళ్లు చేశారు. ఒప్పందం ప్రకారం సంస్థ మూడు నెలల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. కానీ నకిలీ సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్ షిప్ పత్రాలు రూపొందించి వారికి ఆన్‌లైన్‌లో పంపించారు. ఈ విషయాన్ని గ్రహించిన హాఫీజ్.. ఎంఎస్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ నిర్వాహకులు నకిలీ పత్రాలు ఇచ్చారని బాధితులకు తెలిపారు. అనంతరం మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఎండీ.మినాజోద్దీన్ ఖాన్, ఎండీ. దానిష్‌ను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 4.40 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. షేక్ అలీమ్ అహ్మద్ పరారీలో ఉన్నాడు. నకిలీ వీసాల పేర్లతో విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే సంస్థలను నిరుద్యోగులు నమ్మొద్దని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు.

గంజాయి స్మగ్లర్ పై పీడీ యాక్ట్

వరంగల్ క్రైం: గంజాయి స్మగ్లర్‌పై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పీడీ ఉత్తర్వులు జారీ చేశారు. ములుగు జిల్లా పందికుంట గ్రామానికి చెందిన చెక్క కుమారస్వామికి ఆత్మకూరు సీఐ రవిరాజు శుక్రవారం హైదరాబాద్‌లోని చర్లపల్లి జైలులో పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేశారు. కుమారస్వామి సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్ర, హైదరాబాద్ ప్రాంతాల్లో విక్రయించేవాడు. ఈ క్రమంలో ఈ ఏడాది మే 29న నిందితుడు కారులో రూ.24 లక్షల విలువైన 120 కేజీల గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఆత్మకూరు పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. నిందితుడిపై ములుగు, మహబూబాబాద్ జిల్లాలాతోపాటు మహారాష్ట్రలోనూ కేసులు నమోదైనట్లు సీపీ రంగనాథ్ తెలిపారు.



ఉత్తర్వులు అందజేస్తున్న సీఐ రవిరాజు

బతకలేక.. బలవన్మరణం

వివిధ కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వేర్వేరు చోట్ల నలుగురు బలవన్మరణాలకు పాల్పదారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని నారాయణపురం ఓ యువతి, హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో ఓ వ్యక్తి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం గోపాలపూర్‌లో మరో వ్యక్తి, నల్లబెల్లి మండలం రంగాపురంలో ఇంకో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.

తల్లి అనారోగ్య బాధ చూడలేక..

● కూతురు ఆత్మహత్య
● నారాయణపురంలో ఘటన

బచ్చన్నపేట : తల్లి కడుపు నొప్పితో బాధపడుతుండగా తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన కూతురు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన శుక్రవారం మండలంలోని నారాయణపురంలో జరిగింది. గ్రామానికి చెందిన బిచ్చాల నర్సింహులు కుమార్తె శ్రావణి (21) బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసింది. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఇంటి వద్దే ఉంటోంది. ఇదిలా ఉండగా నర్సింహులు భార్య కవిత ఇటీవల కడుపు నొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతోంది. రెండు రోజులుగా నొప్పి ఎక్కువ కావడంతో నర్సింహులు మందలించాడు. దీనికి మనస్తాపం చెందిన శ్రావణి ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. కూతురు ఇంట్లో లేదని గమనించిన కుటుంబీకులు వెతకగా ఉరివేసుకుని వేలాడుతూ కొనఊపిరితో కనిపించింది. వెంటనే కిందకు దింపి ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గ మధ్యలో మృతి చెందింది. ఉద్యోగం చేసి తమను పోషిస్తావనుకుంటే ఇలా మధ్యలోనే వెళ్లిపోయావా బిడ్డా అంటూ శ్రావణి మృతదేహంపై పడి కుటుంబీకులు గుండెలవిసేలా రోదించారు. తల్లిదండ్రుల కలలు ఆవిరి చేసి వెళ్లిపోయావా తల్లి అంటూ గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై సతీష్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


శ్రావణి(ఫైల్)

ధర్మసాగర్‌లో వ్యక్తి..


దేవేందర్‌రెడ్డి (ఫైల్)

ధర్మసాగర్: ఇటు అప్పు తీర్చలేక.. అటు భార్య మృతి చెందిందనే విషయం గుర్తుకు వచ్చి మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన చల్లా దేవేందర్‌రెడ్డి (55) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొంతకాలం క్రితం అప్పు చేసి ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ఇదిలా ఉండగా మూడు సంవత్సరాల క్రితం దేవేందర్ రెడ్డి భార్య క్యాన్సర్‌తో మృతి చెందింది. దీంతో ఇటు అప్పు తీర్చలేక.. అటు భార్య మృతి చెందిందనే విషయం గుర్తుకు వచ్చి తరుచూ మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా గమనించిన ఇరుగుపొరుగు వారు 108లో చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోపాలపూర్‌లో మరో వ్యక్తి..

చిట్యాల: భార్య మందలించిందనే మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడాడు. మండలంలోని గోపాలపూర్ గ్రామానికి చెందిన కుంచాల శంకర్ (56) గురువారం తమ బంధువు మృతి చెందడంతో అక్కడి వెళ్లాడు. ఆ సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య లక్ష్మి.. శ్రావణ మాసంలో అక్కడి ఎందుకెళ్లావని శంకర్‌ను మందలించింది. దీంతో మనస్తాపం చెందిన శంకర్ అదే రోజు రాత్రి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

రంగాపురం ఇంకొకరు..

ములుగు రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ములుగు మండలం బండారుపల్లికి చెందిన ఒడ్డుల రాజేందర్ (33) భార్య సునీతతో కలిసి హైదరాబాద్‌లో జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన రాజేందర్ నిత్యం కుటుంబీకులతో ఘర్షణ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 15వ తేదీన కూడా గొడవ పడడంతో భార్య సునీత పిల్లలతో కలిసి తన పెద్దమ్మ ఊరు నల్లబెల్లి మండలం రంగాపురం చేరుకుంది. దీంతో ఈ నెల 24వ తేదీన రాజేందర్ పురుగుల మందు సేవించి రంగాపురం వచ్చాడు. ఈ విషయం కుటుంబీకులకు తెలపడంతో ఆయనను ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెలంగాణలో సామాజిక న్యాయం లేదు

● 'కడియం'లో కక్కుర్తి పెరిగిపోయింది
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ


మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నయీంనగర్: తెలంగాణలో సామాజిక న్యాయం లేదని, దొరల రాజ్యం నడుస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. శుక్రవారం హనుమకొండ హరిత హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దొరల రాజ్యానికి నిదర్శనం సీఎం కేసీఆర్ పాలన అని, తెలంగాణలో మాదిగలను, బీసీలను అణగదొక్కుతున్నారన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలలో ముగ్గురు మాత్రమే మంత్రులని, బీసీ కోటాలో ఖాళీ అయిన మంత్రి స్థానం రెడ్లకు కేటాయింపుతో తెలంగాణలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. సీఎం కేసీఆర్ రెండు బీసీ అభ్యర్థుల నియోజకవర్గాల్లో పోటీ చేస్తూ వారికి గండి కొడుతున్నాడన్నారు. బీఆర్ఎస్ పార్టీలో 11 మంది ఎస్సీ ఎమ్మెల్యేలు ఉన్న మాదిగలకు మంత్రివర్గంలో ఒక్కరికి కూడా చోటు లేదు కానీ, ఆరుగురు రెడ్లకు మంత్రి పదవులు ఉండగా ఏడవ మంత్రి పదవి ఎందుకు ఇస్తున్నారో సమాజానికి జవాబు చెప్పాలన్నారు. కడియం శ్రీహరిలో కక్కుర్తిలో పెరిగిపోయిందని, ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఉండగా ఎమ్మెల్యే టికెట్ ఎందుకని ప్రశ్నించారు. ఆయనపై ఉన్న గౌరవం పోయిందన్నారు. కడియం శ్రీహరి రాజీనామా చేసి స్టేషన్ ఘన్‌పూర్‌లో మాదిగలకు సీటు కేటాయించాలన్నారు. భిన్న పార్టీల కార్యకర్తల మధ్య దాడులు సరికాదని, ఏ పార్టీ వారు కూడా ఇంటిమీద దాడులకు పిలుపు ఇవ్వవద్దన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు తీగల ప్రదీప్ గౌడ్, మంద కుమార్ మాదిగ, సుకుమార్ మహాజన్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడిస్తేనే ఉద్యోగాలు

● డీవైఎఫ్ఐ జాతీయ కార్యదర్శి హిమగ్ని రాజ్ భట్టాచార్య



మాట్లాడుతున్న హిమగ్ని రాజ్ భట్టాచార్య

హన్మకొండ : దేశంలో బీజేపీని ఓడిస్తేనే యువతకు ఉద్యోగాలు లభిస్తాయని డీవైఎఫ్ఐ జాతీయ కార్యదర్శి హిమగ్ని రాజ్ భట్టాచార్య అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'విద్యా, ఉపాధి' అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో హిమగ్ని రాజ్ భట్టాచార్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలోని నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం.. ఆ హామీని నెరవేర్చలేక పోయిందని విమర్శించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కార్యదర్శి అనగంటి వెంకటేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్, కార్యదర్శి దొగ్గెల తిరుపతి, నాయకులు బషీర్, తిరుపతి నాయక్, రోషన్ బేగం, వెంకటేష్, గొడిశాల కార్తీక్, జగన్ పాల్గొన్నారు.

రాంచందర్ హత్యకేసులో పురోగతి..!

● హత్య చేసి బైక్‌పై పరారీ..
● సీసీ ఫుటేజీ ద్వారా గుర్తింపు
● నిందితుల ఫొటోలు విడుదల


బైక్‌పై పరారవుతున్న నిందితులు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటలో బుధవారం జరిగిన విశ్రాంతి ఆర్టీసీ ఉద్యోగి నాముతాబాజీ రాంచందర్(65) హత్య కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించినట్లు కనిపిస్తోంది. ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ టి. నరేష్ నేతృత్వంలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఘటన జరిగిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే కరీమాబాద్-వరంగల్ ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు నిందితులు బైక్‌పై పరారీ అవుతున్నట్లు కనిపించింది.

నిందితులను గుర్తిస్తే సమాచారం ఇవ్వండి

రాంచందర్‌ను హత్య చేసిన నిందితులు బైక్‌పై పరారవుతున్న ఫొటోలను విడుదల చేశామని, ఎవరైనా నిందితులను గుర్తించినా, వారి ఆచూకీ తెలిసినా వెంటనే తమకు సమాచారం అందించాలని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టీ. సురేష్ పేర్కొన్నారు. ఈమేరకు నిందితులు హీరో ఫ్యాషన్ బైక్‌పై పరారవుతున్న ఫొటోలను శుక్రవారం విడుదల చేశారు. నిందితులను గుర్తించిన వారు వెంటనే మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సెల్ నెంబర్ 8712685119, ఐటీ సెల్ వరంగల్ ఇన్‌స్పెక్టర్ 8712685159, టాస్క్‌ఫోర్స్ వరంగల్ ఇన్‌స్పెక్టర్ 8712685150, మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ నంబర్ 8712685006 సమాచారం అందజేయాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో దొరల పెత్తనం ఏందీ?


మాట్లాడుతున్న సుధాకర్

● మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

హన్మకొండ: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వజ్రోత్సవాలు పూర్తి చేసుకున్నా ఇంకా దొరల పెత్తనం పోవడం లేదని, ఎస్సీ ఎస్టీ నియోజకవర్గాల్లో వారి పెత్తనం ఏందని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ప్రశ్నించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో తెలంగాణ మాల మహానాడు హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీలో దొరల ఆధిపత్యం కొనసాగుతుందోన్నారు. తమ ఆధిపత్యం కొనసాగడానికి కొంతమందితో రాజకీయ బ్రోకరిజం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ స్థానాల్లో ఇదే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే వచ్చే ఎన్నికల్లో ఓటు చైతన్యం కోసం అంబేడ్కర్ ఆలోచన విధానాలను గ్రామాల్లో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, రాష్ట్ర పొలిట్ బ్యూరో చైర్మన్ అశోద భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి నీరటి రాములు, రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, కొంద్ర నర్సింగరావు, గంపల సాంబయ్య, నర్సింహారావు, భవాని, అనిత, తదితరులు పాల్గొన్నారు.